కథ

మల్లాది రమాంజలి

# ఆ వంటావిడ

'ఈగ' ఇల్లు అలుక్కుంటూ పేరు మర్చి పోయిందట... అనేది అలనాటి కథ... ఈనా టికీ మనం కథగా చెప్పుకుంటూనే ఉన్నాం. కానీ... ఏభై ఏళ్ల క్రితం మా అమ్మా, నాన్నా నాకు పెట్టిన పేరు నేనెప్పుడో మరిచిపో యాను. అందరూ నన్ను 'ఆ వంటావిడ' అనే పిలుస్తారు. ఇంట్లో మాత్రం ఆయన నన్ను ప్రేమగా 'పద్మావతీ' అని పిలుస్తారు. అప్పుడు నాకు నా పేరు గుర్తుకు వచ్చి మనస్సుకి ఊరట కలిగిస్తుంది.

ఆర్థిక సంక్షోభంతో ఆయన ఉద్యోగం పోయినపుడు బాధ పడ్డాను. నాకంటే ఎక్కువగా బాధపడుతున్న... నలుగురిలో ఆయన ముఖం చిన్నబోయినప్పుడు మాత్రం నాకు నేను ధైర్యం చెప్పుకొని, ఆయనకు ధైర్యం చెప్పాను. ఆడపిల్లకు పెళ్లయి పోయినా... పిల్లవాడి చదువు మాత్రం మధ్యలో ఆగిపోవలసి వచ్చేది... వారం రోజులు తీవ్రంగా ఆలోచించాను... మా సమస్యకు ఓ చిన్న పరిష్కారం దొరికింది. అరవయ్యో పడిలో పడుతున్న ఆయనను ఇంకా కష్టపెట్టదలుచుకోలేదు. నా నిర్ణయం ఆయన ముందు ఉంచాను. మొదట నా వంక కోపంగా చూశారు. అవమానపడి తలదించుకున్నారు, ఇదేం నిర్ణయం పద్మావతీ అన్నారు. నాలుగు రోజులు నచ్చచె ప్పాక... అతికష్టం మీద ఊ... అనిపించగలిగాను.

అక్క స్థానంలో నేను ముందుగా పుడితే బాగుండే దమ్మా! అన్నాడు కొడుకు... చదివే ఇంజనీరింగ్ మానేసి ఉద్యోగం చూసుకుంటానన్నాడు. మాకంటూ మాకు ఆస్తులేం లేకపోయినా, మా పిల్లలే పెద్ద ఆస్తి... వాళ్లకి మంచి రెక్కలిస్తే అదే పదివేలనుకున్నాను... అందుకు తగినట్లుగా అమ్మాయి కాలేజీ లెక్చరర్ అయింది. పెళ్లి చేసుకుని తన కుటుంబాన్ని ఏర్పర్చుకుంది... అమ్మా! నాకు రెక్కలిచ్చావు... మీకు నీడనిస్తా అంటుంది. ఉమ్మ డిలో ఉన్న దాని ముందు దేహీ అని చెయ్యి చాస్తే... అంత కంటే అవమానం ఇంకోటి ఉంటుందా!

మా వాళ్లంతా మీ అమ్మ వంటావిడ అంటుంటే నాకు అవమానం అమ్మా... అన్నది కూతురు. మా అమ్మ వంటావిడ కాదు... ఫైవ్‌స్టార్ హోటల్లో 'చెఫ్' అని చెప్పు అన్నాను. దొంగతనం చేస్తే తప్పు... ఇంకో పని చేస్తే నేరం... నేను రెండూ చెయ్యటం లేదు. నీతి, నిజాయితీగా చేసే ఏ వృత్తీ అవమానం కాదు అనేవాళ్ల నాలుకకు రెండు వైపులా పదును ఉంటుంది... అనుకోనీ అన్నాను. గట్టి నిర్ణయం తీసుకున్న ప్రతి వ్యక్తికీ దానివెనకే మొండి తనం కూడా ఉంటుందనుకుంటా... మా వారు శ్రోత, ప్రేక్షకులే అయ్యారు. మౌనంగా ఉన్న ఆయనను చూస్తుంటే తుఫాన్ ముందు వచ్చే ప్రశాంతతా అనిపిం చిందో క్షణం. కానీ... నా మొండితనం నన్ను జయిం చింది.

నా ఫ్రెండ్స్ అందరి ముందూ అవమానం అమ్మా! అన్నాడు కొడుకు... నీ ఫ్రెండ్స్‌లో 'హోటల్ మేనేజ్ మెంట్' కోర్స్ చేసే వాళ్లు కూడా ఉన్నారు కదరా! నీకెం దుకు అవమానం అన్నాను.

అలనాడు 'భీము'డంతటి వాడే 'విరాట రాజు' కొలు వులో వంటవాడయ్యాడు... అవమానపడ్డాడా! పడలేదు. 'ఉదర పోషనార్థం బహుకృత వేషమని ఊర్కే అన్లేదు కదా!' అన్నాను.

మా వాళ్లే 'కన్విన్స్' అయ్యారో నేనే చేయగలిగానో గానీ ఫలితంగా మా ఇంటి ముందు 'అన్ని శుభకార్యము లకు వంటలు చేయబడును' అనే బోర్డు పెట్టగలిగాను.

ఆ మర్నాడే నా పాకశాస్త్ర ప్రావీణ్యం చూపగలిగే అవకాశం ఒకటి వచ్చింది.

ఓ నిండు ముత్తయిదువ, ఓ పెద్దాయనా వచ్చి హాల్లో కూర్చున్నారు. చేసే స్వీట్లు, హాట్లు, వంట చెయ్యవలసిన రోజులు చెప్పారు. అన్నీ విని రేటు చెప్పాను. కిందా, మీదా పెట్టి చివరకు 'ఓకె' చేసి అడ్వాన్స్ నా చేతిలో పెట్టి వెళ్లిపోయారు. చేసే పని నాకు కొత్త కాదు, కానీ... అది వృత్తిగా మార్చుకుంటే కొత్తే కదా! అనిపించిందో క్షణం. నాలో తెగింపు నాకు ధైర్యాన్నిచ్చింది.

మర్నాడు అడ్రస్ వెతుక్కుంటూ ఆ ఇంటికి వెళ్లాను. నన్ను నేను పరిచయం చేసుకున్నాను. క్రితం రోజు మా ఇంటికి వచ్చిన పెద్దావిడ నన్ను చూసి లోపలికి తీసుకువె ళ్లింది. "అమ్మయ్య... వంటావిడ వచ్చేసింది. ఇక సమస్య లేదు" అంటోందో పెద్దావిడ. మొదటిసారిగా మనస్సు కొంచెం అవమానపడి చిన్నబోయినా... వెంటనే సర్దుకు న్నాను.

"అమ్మో! రోజుకు ఎనిమిది వందలా! ఈ వంటవా ళ్లకి చాలానే డిమాండ్ పెరిగింది. వంట తగలడినట్టుగా ఉంటే మాత్రం దండగే" అంటున్నాడో పెద్దమనిషి.

"మనిషి చూస్తే నీటుగానే ఉందే అమ్మాయ్! పని కూడా నీటుగానే ఉంటుందిలే. ఈ రోజుల్లో వంటవాళ్లు, ఇదివరకులా ముతక చీరలు కట్టుకుని రావటంలా. ఆ షోకులు, ఆ దర్జాలూ... అని ఒకామె అంటే....

"ఉష్... ఉష్... ఊరుకోండే... వింటే బాగుండదు".... అని ఒకామె.

అన్నీ నా చెవులకు సోకినా... నన్ను కాదన్నట్లుగా ఊరుకొని నా పని చకచకా చేసేస్తున్నాను... చేసే 'పని' పట్ల గౌరవం ఉంటే, ఏదీ అవమానమనిపించదనే విషయం మొదటిసారిగా నేర్చుకోవలసి వచ్చింది నాకు.

* * *


"ఏమే పద్మావతీ... ఈమధ్య వంట మనిషిగా ఎవరిం ట్లోనో కుదిరావటగా... ఇంత బతుకూ బతికి ఇంటివెన కాల చచ్చినట్లు ఏం పనే అదీ"... పిన్ని కూతురు పెళ్లిలో కలసిన 'పెద్దమ్మ' నిలదీస్తుంటే....

"నేను చేసే పని నాకేం అవమానంగా లేదు పెద్దమ్మా! పదిమందిలో ఒకదానిగా పుట్టిన నా చదువు పదో తరగతితో ఆగిపోయింది... అదృష్టం బాగుండి నాకు ఉద్యోగస్థుడైన భర్త దొరికాడు... అన్ని రోజులూ మనవేనా పెద్దమ్మా! ఓడలు బళ్లు, బళ్లు ఓడలు అవు తాయి. ఆయన మా కోసం ముప్పై ఏళ్లు కష్టపడ్డారు. నేను కనీసం పదేళ్లన్నా కష్టపడలేనా! నా చదువుకి ఈ ఉద్యోగం తప్ప ఏం ఉద్యోగం వస్తుంది? పెద్దలిచ్చిన ఆస్తులు ఏమన్నా కొట్టుకుపోతున్నాయి కనుకనా! నా కొడుకు ఓ మంచి ఇంజనీరు కావాలి... మంచి ఉద్యోగం సంపాదించుకోవాలి. ఓ ఇంటివాడు కావాలి... నా లక్ష్యం అదే. దేహీ... అని మీ ఇళ్లకి వచ్చి నేనేమీ అడగలేదు కదా!" చిన్నగా ఓ చురక అంటించి అక్కడి నుంచి కది లాను.

"పోనీలేవే అక్కయ్యా! దాని కష్టాలేవో అది పడు తోంది. మొగుడి ఉద్యోగం పోతే అది మాత్రం ఇంత కంటే ఏం చేస్తుంది? తన దారేదో తను వెతుక్కుంది. సహాయం చెయ్యకపోగా ఈ మాటలు ఎందుకులే. వింటే అది ఇంకా అది బాధపడుతుంది పాపం. ఇంకేమీ అనకు..." అంటూ ఇంకో పిన్ని సమర్థించటం నా చెవు లకు సోకి చిన్నగా నిట్టూర్చాను.

* * *

"పద్మావతీ... కొంచెం మంచినీళ్లిస్తావా! బయట ఎండ విపరీతంగా ఉంది" నుదుటికి పట్టిన చెమటను



తుడుచుకుంటూ... లోపలికి అడుగుపెట్టారాయన.

మంచినీళ్ల గ్లాసందిస్తూ ఆయన ముఖంలోకి పరిశీలనగా చూశాను. అలసిపోయినట్లున్న ఆయన ముఖం చూస్తుంటే గుండెల్లో ఏదో మూల సన్నని బాధ.

ఉద్యోగం ఉన్న రోజుల్లో ఎంత దర్జాగా ఉండేవారాయన. రాజ్యం కోల్పోయిన రాజులా ఉన్నారిప్పుడు. సుళ్లు తిరుగుతున్న బాధ నా మనస్సును మెలిపెడుతోంది. మునపటి కన్నా ఇప్పుడు సంపాదన బాగానే ఉంది... రుచిగా, శుచిగా వంట చేస్తాననే మంచి పేరు వచ్చింది నాకు.

"పద్మావతీ! నువు వంటలు చేయటం మానలేవా!" నా ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ అన్నారాయన.

ఇన్నాళ్లుగా ఊహించని మాటలు ఆయన నోటి నుండి వినవస్తున్నాయి.

"ఏమయిందండీ.. ఎవరన్నా ఏమన్నా అన్నారా?" ప్రశ్నించాను.

"ఇందాక బజారులో నా కొలీగ్స్ ఇద్దరు కనపడ్డారు పద్మావతీ... నిన్ను గురించి అదో మాదిరిగా మాట్లాడారు. చివరికి మీ ఆవిడ వంటలు చేస్తోందిటగా పాపం. ఏం చేస్తార్లే. బ్రతకటానికి అనేక మార్గాలు. అయినా చివరికి ఆడదాని సంపాదన మీద బ్రతకవలసి వచ్చిందిరా పరమేశం... అని ఎగతాళిగా అన్నారు... పద్మావతీ... మనకు చేతనైన పని చేసుకుంటూ బ్రతుకుతున్నా మాట పడవలసి వస్తోంది" దిగులుగా అన్నారాయన.

"నరం లేని నాలుకలు అనేకం అంటాయండీ. అవన్నీ మీరు మనస్సులో పెట్టుకొని బాధపడకండి. మీరు ఊర్కే కూర్చోవటం లేదు కదా! ఏదో ఉద్యోగ ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. రేపు మన అబ్బాయి వేలకి వేలు సంపాదించినపుడు వీళ్ల నోళ్లన్నీ మూతపడకపోతాయా" ఆయనకు ధైర్యం చెప్పాను.

బాధగా కణతలు రుద్దుకుంటూ ఉండిపోయారాయన.

* * *

"అమ్మా! మా ఆడపడుచు కూతురు 'బారసాల' ఇంకో నాలుగు రోజుల్లో పెట్టుకున్నారు. మా అత్తగారు, మీ అమ్మ మన ఇంట్లో వంట చేస్తుందా! డబ్బులు ఇద్దాం లేవే 'నళినీ'... మీ అమ్మ వృత్తికి న్యాయంగానే ముట్టచెపుతాంలే... వంట చేస్తుందేమో ఓసారి అడిగి చూడు... ఎగతాళిగా అన్నారమ్మా" నా కూతురు నా ఒడిలో తలుపెట్టుకొని బావురుమంది.

ఏ కూతురైనా అలా గుండెలవిసేలా ఏడుస్తుంటే, ఏ తల్లి బాధపడకుండా ఉంటుంది?

"మీ నాన్నగారు చిరుద్యోగి అయినా వచ్చిన డబ్బుతో ఇన్నాళ్లూ గుట్టుగా బ్రతికామమ్మా! ఇంటి అద్దె లేనే లేదు. తాతలనాటి

ఈ ఇల్లే ఇన్నాళ్లూ మనకు నీడనిచ్చింది. నాకు సరైన చదువు లేకపోయినా పుట్టిన మీ ఇద్దర్నీ గొప్పగా చదివించాలనే ఉద్దేశ్యంతో నిన్ను లెక్చరర్‌ని చేశాం. తమ్ముడిని ఇంజనీరుని చెయ్యబోతున్నాం. వచ్చినదంతా మీ చదువులకి, ఇంటి ఖర్చులకే సరిపోయేది. ఇక వెనకేసుకోడానికి డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది? నీ అదృష్టం బాగుండి నీ ఉద్యోగం చూసి కానీ కట్నం ఆశించకుండా నిన్ను ఇష్టపడి చేసుకున్నారు వాళ్లు... మంచికో, చెడుకో నేనీ వృత్తి చేపట్టాను. మీ నాన్నగారి ఇష్టంతోనే నేనీ పని చేస్తున్నాను. ఎవరు ఏమనుకుంటే నాకేమిటి? మీ ఇంటికి తప్పకుండా వస్తాను. ఏడవకు" అంటూ నళిని కళ్లు ప్రేమగా తుడిచాను.

* * *

"వంట బ్రహ్మాండంగా ఉంది ఒదినగారూ! అందుకే అనుకుంటా... మీకీ మధ్య మంచి డిమాండ్ పెరిగింది" వియ్యపురాలు నాతో చలోక్తులు విసురుతుంటే విని తేలిగ్గా నవ్వేశాను.

భోజనం చేసి వచ్చేస్తుంటే నా ముఖాన బొట్టు పెట్టి, ఓ జాకెట్ ముక్కా, ఓ ఎనిమిది వందలూ నా చేతిలో పెట్టింది మా వియ్యపురాలు.

"జాకెట్ ముక్కా, పసుపూ, కుంకం నాకు చాలు వదినగారూ! ఈ డబ్బు నాకొద్దు. నా వృత్తిని అడ్డంపెట్టుకొని నేను రాలేదు. ఓ వంటావిడగానూ రాలేదు. నాకు చేతనైన సాయం చేశాను పిలిచారు కనుక... మీ వియ్యపురాలిగానే వచ్చాను" అంటూ ఆ ఎనిమిది వందలూ 'పసిబిడ్డ' చేతిలో పెట్టి ఆ గుమ్మం దాటాను.

* * *

అడుగడుగునా అవమానాలూ, ఎకసెక్కాలు, వేళాకోళాలూ... అయినా నా వృత్తి కొనసాగుతూనే ఉంది...ఊర్కే కూర్చుంటే ఊసుపోక నాకు కొన్ని గంటలు సాయం చేస్తూ, ఓ చిన్న పార్ట్‌టైం ఉద్యోగం చూసుకున్నారాయన. వేన్నీళ్లకి చన్నీళ్లన్నట్లుగా అదీ బాగానే ఉందనిపించింది నాకు.

వెళ్లిన చోటల్లా నా వృత్తికి ఒకింత చిన్న చూపయినా ఏదీ అవమానమనిపించి బాధపడలేదు. నాలుగు రోజులు ఉండవలసి వచ్చిన చోట, నాకు పెద్దగా సౌకర్యాలు ఇవ్వక పోయినా 'పీట చెక్క'నే తలగడగా, వంటగదినే పడకగదిగా, చాప, దుప్పటి ముక్కనే పట్టుపరుపులుగా భావించాను.

మరో నాలుగేళ్లకు-


మంచి ఉద్యోగస్తుడైన ఇంజనీరుకి తల్లినయ్యాను. 'మొత్తానికి అనుకున్నది సాధించావే పద్మావతీ... పిల్లవాడు మంచి ఉద్యోగస్తుడు, మంచి పెళ్లికొడుకూ కూడా అయ్యాడు.. మా మనవరాలిని వాడికి చేసుకుంటావా అంటే... నా కూతుర్ని నీ కోడలిగా చేసుకుంటావా వదినా...' అంటూ బంధువులంతా ఎగబడ్డారు.

ఈ వంటావిడ కొడుకు మీకు నచ్చితే, నా వృత్తి మీకు అవమానం, అడ్డం కాక పోతే... వాడు మెచ్చిన అమ్మాయిని నా కోడలిగా చేసుకుంటానన్నాను.

చివరికి మంచి కోడలే దొరికింది నాకు. మరో రెండేళ్లకు 'లోన్' తీసుకొని ఓ మంచి ఇల్లు కట్టుకున్నాడు మా వాడు. నా వృత్తి మానేసి తన దగ్గరకు వచ్చి ఉండిపొమ్మన్నాడు. ఆపదలో ఆదుకున్న ఈ వృత్తి దైవంతో సమానం. అన్నపూర్ణాదేవిలా పదిమందికీ వండిపెట్టటంలోనే నాకు సంతోషం ఉందన్నాను. ఓపిక ఉన్నంతకాలం ఎవరి మీదా ఆధారపడదల్చుకోలేదని నిక్కచ్చిగా చెప్పాను. మొండివాడు రాజు కంటే బలవంతుడన్నట్లుగా నాకు ఎదురు చెప్పలేక మా వాడు తన సొంత ఇంట్లో కాపురం పెట్టాడు, వెంటనే ఓ బిడ్డకు తండ్రి కూడా అయ్యాడు.

ముద్దులు మూటగట్టే మా మనవరాలు మూడేళ్ల ప్రాయంలోకి వచ్చింది. నాకు పని లేనప్పుడు రోజల్లా పిల్లతోనే కాలక్షేపం చేస్తూ ఉంటాను. దాని బుడిబుడి నడకలు, చిలకపలుకులు ముచ్చటగా ఉంటాయి నాకు. కథలు, కబుర్లు చెప్పమని గారాలు పోతుంది... నాలాగానే వంటావిడ వేషం వేసి అన్నాలాటలు ఆడుతుంది. చిన్న చేతులతో ఉత్తుత్తి వంటలు చేసి తినిపిస్తుంది... అదో పెద్ద కాలక్షేపం నాకు... ఓ రోజు కథ చెప్పు నానమ్మా! అంటూ నా దగ్గరకు వచ్చిన దానితో అనుకోకుండా 'ఈగ' కథ మొదలుపెట్టాను.

"ఈగ పేలు మలిచిపోటమేంటి నానమ్మా! ఈగ పేలు ఈగే కదా! అయితే కథ చెప్పే నానమ్మ పేలేంతి? నానమ్మే కదా..." అంటూ "నీ పేలేంతి నానమ్మా!" అని ప్రశ్నించిన నా మనవరాలితో... "నా పేరా తల్లీ... నా పేరు వంటావిడ" అంటూ గలగలా నవ్వేశాను... నా నవ్వులో శృతి కలిపింది నా మనవరాలు.



# ఫ్రీదా ప్యార్‌కహానీ!

ఆస్కార్ అవార్డులను గెలుచుకున్న 'స్లమ్‌డాగ్ మిలియనీర్' జంట ఫ్రీదా పింటో, దేవ్ పటేల్ నిజజీవితంలోనూ ప్రేమజంటగా మారుతున్నారని బాలీవుడ్ వార్తలు చెబుతున్నాయి. లండన్‌లో వుండే దేవ్ ఈమధ్య ముంబయ్ వచ్చినప్పుడు ఫ్రీదా అతన్ని తన తల్లిదండ్రులకు పరిచయం చేసిందనీ, వాళ్లు ఆమె ఇష్టప్రకారం దేవ్‌ని తమ అల్లుడ్ని చేసుకోడానికి సుముఖత తెలియచేసినట్టు కథనాలు వినిపిస్తున్నాయి. ఇద్దరి సినీ కెరీర్‌లు ఇప్పుడే టేకాఫ్‌లో వుండగా మరి పెళ్లి చేసుకుంటారా? అనేది అందరి సందేహం!